andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.6 కనిష్ఠం 21.8
నిర్మల్ జిల్లా వార్తలు
8
గురువారం 24 అక్టోబరు 2024



క్యాన్సర్ వ్యాధిపై అవగాహన అవసరం

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో క్యాన్సర్‌వ్యాధిపై అవగాహన అవసరమని జిల్లా వైద్యాధికారి రాజేందర్ అన్నారు. బుధవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కరపత్రాలు ఆవిష్కరించారు. గుట్కా, గంజాయి, పొగాకు వ్యసనంగా మారినవారు క్యాన్సర్‌వ్యాధి బారిన పడుతున్నారన్నారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీనివాస్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కే. చంద్రమోహన్ రెడ్డి, కోశాధికారి లక్ష్మీనారాయణగౌడ్, జోన్ చైర్మన్ ఎల్. రాజేశ్వర్ రెడ్డి, డైరెక్టర్ నేరెళ్ల హనుమంతు పాల్గొన్నారు.

గవర్నర్‌తో ట్రిపుల్ ఐటీ వీసీ భేటీ



బాసర, అక్టోబర్, 23 : (ఆంధ్రజ్యోతి) హైదరాబాద్ రాజ్ భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌ను బుధవారం బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ కలిశారు. ఇటీవలే నూతనంగా నియమితులైన యూనివర్సిటీల వైస్ చాన్సలర్‌లతో కలిసి సమావేశమయ్యారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్, వైస్ చైర్మన్ ఉన్నారు. ఇందులో భాగంగా యూనివర్సిటీలో విద్యార్థుల వసతులు, కోర్సులు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, విద్యార్థుల సంక్షేమం వంటి అంశాలపై వైస్ చాన్సలర్ గవర్నర్‌కు వివరించినట్లు యూనివర్సిటీ అధికారులు తెలిపారు.

ఎత్తిపోతలకు పూర్వవైభవం





- ఐడీసీ పరిధిలోకి జిల్లాలో ఎత్తిపోతలు
- ఇరిగేషన్ నుంచి విముక్తి
- గత బీఆర్ఎస్ సర్కార్ నిర్లక్ష్యంతో మూతబడ్డ పథకాలు
- నిధుల కొరతతో నిలిచిపోయిన మరమ్మతులు
- నీరుగారిన 45 వేల ఎకరాల సాగులక్ష్యం

నిర్మల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీడు భూములను సాగులోకి తీసుకువచ్చేందుకు నిర్మించిన ఎత్తిపోతల పథకాలన్నీ ఒకటి రెండు చోట్ల మినహా ఎక్కడ కూడా పనిచేయడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎత్తిపోతల పథకాల వ్యవస్థపై పూర్తిగా నిర్లక్ష్యం ప్రదర్శించడం అలాగే నిర్వహణకు, మరమ్మతులకు అవసరమైన నిధులను మంజూరు చేయకపోవడంతో కొట్ల రూపాయలతో నిర్మించిన ఈ పథకాలన్నీ నిరుపయోగంగా మారిపోయాయి. ఈ పథకాల ద్వారా దాదాపు 45 వేల ఎకరాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యం సైతం నీరుగారి పోతుందంటున్నారు. అలాగే అప్పటి ప్రభుత్వం ఎత్తిపోతల పథకాల వ్యవస్థను నిర్వహించే ఐడీసీ (ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్)ను ఇరిగేషన్ శాఖలో విలీనం చేసింది. దీంతో ఇరిగేషన్‌శాఖ తన పరిధిలోని పథకాల నిర్వహణతో పాటు ఈ ఎత్తిపోతల పథకాల నిర్వహణ బాధ్యతను చేపట్టింది. అప్పటికే తీవ్రమైన ఆర్థిక, పనిభారంతో సతమతమవుతున్న ఇరిగేషన్ శాఖకు ఈ ఎత్తిపోతల పథకాల నిర్వహణ మరింత భారమైంది. దీంతో ఆ శాఖ ఇటువైపు ఆశించిన మేర దృష్టి సారించలేకపోయింది. ఈ భారాన్ని మోయలేక ఇరిగేషన్ శాఖ చేతులెత్తేసింది. దీంతో ఎక్కడికక్కడ ఈ ఎత్తిపోతల పథకాలపై గత ప్రభుత్వ నిర్వాహకాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు ప్రస్తుత ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ప్రభుత్వం దీనిపై కసరత్తు జరిపి ఎత్తిపోతల పథకాన్నింటినీ ఇరిగేషన్ నుంచి తప్పించేందుకు నిర్ణయించింది. తిరిగి ఐడీసీని పునరుద్ధరించి ఆ సంస్థ పరిధిలోకి ఎత్తిపోతల పథకాల నిర్వహణ బాధ్యతలను తీసుకురానున్నారు. అలాగే ఎత్తిపోతల పథకాలకు ప్రభుత్వం పెద్దమొత్తంలో నిధులు కూడా మంజూరు చేసేందుకు సిద్ధమవుతున్న కారణంగా ఇక ఈ పథకాలకు మహర్దశ పట్టబోనుందంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో 68 పథకాలు

ఐడీసీ పరిధిలో మొదట ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 68 ఎత్తిపోతల పథకాలు నిర్మించగా ఇందులో నుంచి 80 శాతంకు పైగా పథకాలు పని చేయడం లేదన్న ఫిర్యాదులున్నాయి. సంబంధిత శాఖ అధికారుల నిర్వాకం కారణంగానే కాకుండా రైతుల అవగాహన లోపం, నిధుల కొరత ఈ పథకాల నిర్వహణకు సమస్యగా మారిందన్న వాదనలు ఉన్నాయి. ముఖ్యంగా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఎత్తిపోతల పథకాల నిర్వహణకు సంబంధించి నిధులు విడుదల చేయకపోవడం, అలాగే నిర్వహణపై ప్రత్యేకదృష్టి సారించకపోవడం ఈ పథకాల నిర్వహణకు శాపంగా మారిందని అంటున్నారు. సంబంధిత ఐడీసీ అధికారుల లెక్కల ప్రకారం మొత్తం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 68 ఎత్తిపోతల పథకాలు ఉండగా ఇందులో నుంచి జిల్లాలో మొత్తం 42 ఎత్తిపోతల పథకాలు ఉన్నట్లు అధికారులు వివరిస్తున్నారు. కాగా నిర్మల్ జిల్లాలో కేవలం 2 ఎత్తిపోతల పథకాలు పనిచేస్తుండగా మరో ఆరు పాక్షికంగా పని చేస్తున్నాయి. మిగతా 34 ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా మారాయన్న విమర్శలున్నాయి. అలాగే మంచిర్యాల జిల్లాలో మొత్తం 13 ఎత్తిపోతల పథకాలకు గాను ఏడు ఎత్తిపోతల పథకాలు పనిచేయడం లేదంటున్నారు. కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో ఐదు ఎత్తిపోతల పథకాలు, ఆదిలాబాద్‌లో రెండు ఎత్తి పోతల పథకాలు పనిచేయకుండా నిరుపయోగంగా మారాయి.



లోకేశ్వరం మండలంలోని పిప్రి ఎత్తిపోతల పథకం నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అడుగడుగునా నిర్లక్ష్యం

అయితే అధికారులు చెబుతున్న లెక్కలకు వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయంటున్నారు. అధికారులు చెబుతున్నట్లుగా పని చేస్తున్న ఎత్తిపోతల పథకాలలో కూడా అనేక లోపాలున్నట్లు విమర్శలున్నాయి. జలాశయాలు, నదులు, వాగులు ఉన్న ప్రాంతంలో ఈ ఎత్తిపోతల పథకాలను నిర్మించారు. ముఖ్యంగా గోదావరి పరివాహక ప్రాంతంలోని జలాశయాలను లక్ష్యంగా చేసుకొని నిర్మించిన ఎత్తిపోతల పథకాల ద్వారా వందలాది ఎకరాలకు సాగునీరును అందించాలన్న లక్ష్యాన్ని నిర్ధారించారు. చాలా చోట్ల ఎత్తిపోతల పథకాలు పూర్తిగా నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఎప్పటికప్పుడు మరమ్మతులు చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోతుండడమే సమస్యకు అసలు కారణంగా పేర్కొంటున్నారు. ఇలా నెలల తరబడి ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన పరికరాలు, పంపులు, మోటార్లు, పైప్‌లైన్లకు మరమ్మతులు చేయకపోతుండడం ఈ పథకానికి ఆటంకంగా మారుతుంది. అప్పటి ప్రభుత్వం ఓవైపు ఇరిగేషన్ రంగానికి కోట్లాది రూపాయలు మంజూరు చేసినట్లు ప్రకటించినప్పటికీ ఎత్తిపోతల పథకాల నిర్వహణ విషయంలో మాత్రం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్న విమర్శలున్నాయి. ముఖ్యంగా మరమ్మతులు, నిర్వహణకు సంబంధించిన నిధుల విడుదల విషయంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్న ఫిర్యాదులున్నాయి.

నిర్మించి ఏళ్లు గడుస్తున్నా రైతులకు అప్పగించలేదు

కాగా జిల్లాలోని లోకేశ్వరం మండలం మన్మథ్ గ్రామంలో నిర్మించిన ఎత్తిపోతల పథకాన్ని ఇప్పటి వరకు సంబంధిత శాఖ అధికారులు ఆ పథకం పరిధిలోని రైతులకు అప్పగించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ పథకం చెడిపోయి ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులు ఇప్పటి వరకు పూర్తి కాలేదు. రైతులు చాలాసార్లు అధికారులకు ఈ విషయమై వినతిపత్రాలు అందజేసినప్పటికీ వారిలో స్పందన కనిపించడం లేదంటున్నారు. ఈ పథకం నిరుపయోగంగా మారిందన్న ఆరోపణలున్నాయి.

సంక్షిప్త సమాచారం

సోయా బస్తాల చోరీ



దొంగలు ఎత్తుకెళ్లగా మిగిలిన సోయా బస్తాలు

కుంటాల, అక్టోబర్, 23 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలంలోని అందకూర్ గ్రామంలో మంగళవారం రాత్రి సోయా బస్తాల దొంగతనం జరిగింది. స్థానిక రైతు కన్నం సత్యం తెలిపిన వివరాల ప్రకారం తన పంట చేనులో పండించిన సోయా పంటను గ్రామ సమీపంలోని రోడ్డు పక్కన ఆరబెట్టాడు. బుధవారం విక్రయించేందుకు తీసుకెళ్లాలనే క్రమంలో మంగళవారం రాత్రి సోయాలను సంచులలో నింపి ఉంచగా రాత్రి సమయంలో దొంగలు బస్తాలను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఈ దొంగతనంలో 60 కేజీలతో నిండిన 11 బస్తాలను దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధిత రైతు పేర్కొన్నారు. ఈ మేరకు కుంటాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

ఎంపీహెచ్‌డబ్ల్యూ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేయండి

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో మల్టీపర్పస్ హెల్త్‌వర్కర్ల ఉచిత శిక్షణకు ఈ నెల 25లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మేనేజర్ విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పూర్తయిన 35 లోపు మహిళలు రూ. 200ల డీడీ ద్వారా రుసుము చెల్లించి సంబంధిత సర్టిఫికెట్లు జత చేసి సమర్పించాలన్నారు. వివరాలకు 7660022506 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అధిక ఫీజులు వసూలు చేసే కళాశాలలపై చర్య తీసుకోవాలి : టీజీవీపీ

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అధికఫీజులు వసూలు చేసే జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ సంఘం డిమాండ్ చేసింది. బుధవారం ఇంటర్మీడియట్ అధికారి కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. కనీస వసతులు లేకుండా హాస్టళ్లకు అనుమతులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. పట్టణ కోకన్వీనర్ జాదవ్ మిథున్, దీక్షిత్, కరణ్, బాలు, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

భైంసా, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అమరవీరుల సంస్మరణ దినోత్సవాలలో భాగంగా బుధవారం పోలీసు శాఖ భైంసాలోని ఏరియా ఆసుపత్రిలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించింది. ఇందులో భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, టౌన్ సీఐ గోపినాథ్‌తో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసినన సమావేశంలో ఏఎస్పీ అవినాష్ కుమార్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. రక్తదానం అపోహలు విడనాడి అర్హులందరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. ఇందులో భైంసా ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డా. కాశీనాథ్‌తో పాటు వైద్యాధికారులు, సిబ్బంది, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు పెండెపు కాశీనాథ్, ఎంఐఎం ప్రతినిధి అయ్యుబ్ ఖాన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఐటీడీఏ యూనిట్లను పరిశీలించిన పీవో

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : గిరిజన అభివృద్ధి సంస్థ సహకారంతో పర్యావరణ హితంగా నిర్వహిస్తున్న పలు యూనిట్లను ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా సందర్శించారు. గిరిజన బాధ్యత బృందం సభ్యులు చందు, మానస నిర్వహిస్తున్న లవణమిశ్రమ తయారీ అమ్మకాలు అడిగి తెలుసుకున్నారు. పాల ప్యాకింగ్ యూనిట్ సందర్శించారు. పాల సేకరణ, ప్యాకింగ్ వివరాలతో పాటు విజయ డైరీ ద్వారా రైతులకు అందిస్తున్న దాణ, లవణ మిశ్రమం, గడ్డి విత్తనాలు పరిశీలించారు. జేడీఎం నాగభూషణం, జీసీసీ డీఎం రామానందం, డీడీ మధుసూదన్, మేనేజర్ దస్రునాయక్, తదితరులు పాల్గొన్నారు.

కొమురం సురూకు ఘన నివాళి

పెంబి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేణునగర్ గ్రామంలో బుధవారం కొమురం సూరు 27వ వర్ధంతి సందర్భంగా ఆదివాసి నాయకులు ఘన నివాళులు అర్పించారు. తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీవో రమాకాంత్‌లు మాట్లాడుతూ కొమురం భీమ్, కొమురం సూరు చూపెట్టిన మార్గంలో ఆదివాసీలందరూ కొనసాగాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అంతకుముందు ఆదివాసి జెండాను ఎగురవేసి కొమురం సూరు చిత్రపటానికి నివాళులు అర్పించారు.

ఆర్జీయూకేటీలో గణితశాస్త్రంపై జాతీయసదస్సు



సదస్సులో పాల్గొన్న గణితశాస్త్ర నిపుణులు, అధ్యాపకులు

బాసర, అక్టోబర్, 23: (ఆంధ్రజ్యోతి): బాసర ఆర్జీయూకేటీ మ్యాథమెటిక్స్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో ఆర్జీయూకేటీ తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచీకరణ ప్రభావం గణితశాస్త్ర సవాళ్ల అనే అంశంపై ఒకరోజు జాతీయ సదస్సు బుధవారం నిర్వహించారు. గణిత శాస్త్ర నిపుణులు ఆచార్యులతో కలిసి ఆర్జీయూకేటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్ సాగి జ్యోతి ప్రజ్వలన చేసిన ప్రారంభో ఉపన్యాసం చేశారు. గణిత శాస్త్రం నేటి ప్రపంచీకరణ నేపథ్యంలో అనేక సవాళ్లను ఎదుర్కొంటూనే పరిష్కార మార్గాలను వెలికి తీస్తుంది. ప్రధానంగా వాతావరణ నమునాలను అర్థం చేసుకోవడంలో, ఇంజనీరింగ్ విద్యలో గణితశాస్త్ర పరిజ్ఞానం ఎంతో అవసరమని తెలిపారు. నిపుణులు మాట్లాడుతూ వివిధ రంగాలలో మాత్రికల ప్రాముఖ్యత ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ మెషిన్ లెర్నింగ్, గ్రాఫ్ థియరీలో దీని ఉపయోగాలు, ఫినిట్ డిఫరెన్స్ మెథడ్, థామస్ అల్గోరిథం ఉపయోగించిన తీరును ప్రస్తావించారు. ప్రొఫెసర్ సత్యనారాయణ మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ యొక్క సంక్షిప్త జీవిత చరిత్ర రచనలు, పెల్స్ ఈక్వేషన్, శ్రీనివాస రామానుజన్ ప్రొఫెసర్ మహాలోని బాసలతో దాని అనుబంధం, ప్రాచీన గణితానికి దాని ఔచిత్యం గొప్పదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమన్వయ కర్త జీ. తిరుపతి, అసోసియేట్ డీన్స్ డా. పావని, డా. చంద్రశేఖర్, మహేష్, మ్యాథమెటిక్స్ డిపార్టుమెంట్ అధ్యాపకులు సునీల్ కుమార్, డా.కుమార్‌రాగుల, బాలరాజు, సత్తెన్న, సాయన్న, ప్రకాష్, అతిథి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజారక్షణకు ప్రాణాలర్పిస్తా : డీఎస్పీ గంగారెడ్డి



లక్ష్మణచాందలో ఆయుధాలు ప్రదర్శిస్తూ వివరిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

విద్యార్థులకు ఆయుధాల ప్రదర్శన,అవగాహన ఓపెన్‌హౌస్‌లో..



లక్ష్మణచాందలో మాట్లాడుతున్న డీఎస్పీ

లక్ష్మణచాంద, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజా రక్షణ కోసం అవసరమైతే పోలీసులు ప్రాణాలర్పిస్తారని డీఎస్పీ గంగారెడ్డి బుధవారం అన్నారు. అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో 'ఓపెన్ హౌస్' కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీసులు ఉపయోగించే ఏకే47, ఎస్ఎల్ఆర్, కార్బన్, 9ఎంఎం పిస్టల్ తదితర ఆయుధాలను, ఇతర పరికరాలను ప్రదర్శించి విద్యార్థులకు వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజా రక్షణ కోసం, శాంతి భద్రతల పరిరక్షణ కోసం సంఘవిద్రోహశక్తులను నిర్మూలించే సమయంలో ఎందరో పోలీసులు అమరులైనట్లు గుర్తు చేశారు. ప్రజలను కాపాడటం కోసం బీడీ టీమ్, ఫింగర్ ప్రింట్, క్లూస్ టీమ్, షీ టీమ్, భరోసా, కమాండ్ కంట్రోల్ రూమ్ సీసీ కెమెరాలు, రోడ్డు ప్రమాదాలు, స్పీడల్ లేజర్ గన్, ట్రాఫిక్ రూల్స్, గంజాయి ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన కిటల్, డాగ్ స్క్వాడ్స్, సైబర్ క్రైమ్, డయల్ 100, 1930 టోల్ ఫ్రీ నెంబర్‌ల వంటి వాటి గురించి తెలిపారు. ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవించాలని, రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని, సైబర్ నేరాల వలలో పడకుండా తీసుకోవలసిన జాగ్రత్త చర్యల గురించి విద్యార్థిని విద్యార్థులను అప్రమత్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు సోన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్, ఎస్సైలు సందీప్, గోపి, సుమలత, ప్రొబేషన్ ఎస్సై శ్రావణి, ఏఆర్ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

రూ. 50 వేల ఆర్థిక సహాయం అందజేసిన వరల్డ్ విజన్

మండలంలోని తిరుపెల్లి గ్రామానికి చెందిన పేదింటి బాలిక గాండ్ల అనూషకు వరల్డ్ విజన్ అనే స్వచ్ఛంద సేవా సంస్థ రూ. 50 వేల ఆర్థిక సహాయం అందించి బుధవారం తన ఉదారతను చాటుకుంది. అనూష తీవ్ర అనారోగ్యంతో చికిత్స పొందుతోంది.

విద్యార్థుల టిఫిన్‌లో బొద్దింక

- ట్రిపుల్ ఐటీలో ఘటన
- చికెన్ నాణ్యతపై విద్యార్థుల ఫిర్యాదు
- పట్టించుకోని అధికారులు



విద్యార్థుల అల్పాహారం కర్రీలో బొద్దింక

బాసర, అక్టోబర్, 23 : (ఆంధ్రజ్యోతి) :బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో మెస్ నిర్వాహకుల నిర్లక్ష్యం మరోసారి బయటపడింది. టిఫిన్ కర్రీలో బొద్దింక రాగా, వడ్డిస్తున్న చికెన్ నాణ్యతపై విద్యార్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ట్రిపుల్ ఐటీలో 9వేల మంది విద్యార్థులకు భోజన బాధ్యతలు చూసేందుకు మూడు క్యాటరింగ్ సంస్థలకు అప్పగించారు. వారంలో రెండు రోజులు పెట్టే చికెన్ నాణ్యతగా ఉండడం లేదని, లేయర్ కోడి మాంసం ఇస్తున్నారని అనుమానాలు చాలా రోజుల నుంచి వ్యక్తమవుతున్నాయి. బుధవారం స్కిన్‌తో చికెన్ ఉండడంతో కొంత మంది విద్యార్థులు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అదేవిధంగా శనివారం ఉదయం ఒకమెస్‌లో అల్పాహారం కర్రీలో బొద్దింక రావడంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. చాలా మంది విద్యార్థులు టిఫిన్ తినకుండానే వెనుదిరిగారు. ఇలా వరుస ఘటనలు చోటుచేసుకోవడంపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్వాహకుల నిర్లక్ష్యం వల్ల గత రెండేళ్లలో ఆహారంలో కప్పలు, బొద్దింక, పురుగులు, సాలే పురుగులు వంటివి వచ్చాయి. ఫుడ్ పాయిజన్ వంటి ఘటనలు జరిగి వందలాది మంది ఆసుపత్రి పాలయ్యారు. వాస్తవంగా ఇప్పుడు ప్రస్తుతం ఉన్న మెస్ కాంట్రాక్టర్ల గడువు రెండున్నరేళ్ల కిందటే ముగిసింది. అధికారులు వారినే కొనసాగించడం విద్యార్థులు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో తరుచుగా ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

దుబాయ్‌లో మృతి చెందిన మల్లాపూర్ వాసి

లక్ష్మణచాంద, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన ఆకుల గణేష్(31) అనే యువకుడు దుబాయ్‌లో మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... గణేష్ ఉపాధి నిమిత్తం గత కొన్ని సంవత్సరాల క్రితం దుబాయ్ వెళ్లాడు. పనిచేస్తున్న సమయంలో హార్ట్‌ఎటాక్ రావడంతో అక్కడికక్కడే మరణించాడు. గణేష్‌కు భార్య జయశ్రీతో పాటు మూడు సంవత్సరాల వయస్సు గల సాత్విక్ అను కుమారుడు ఉన్నాడు.

కిచెన్‌గార్డెన్‌లో కూరగాయలు పండించండి

లక్ష్మణచాంద, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : కిచెన్‌గార్డెన్‌లో కూరగాయలు పండించి చిన్నారులకు అందించే ఆహారంలో ఉపయోగించాలని ఎంపీడీవో రాధారాథోడ్ అన్నారు. మండలంలోని పొట్టపెల్లి(కె) గ్రామంలో పర్యటించిన ఆమె స్థానిక పంచాయతీ కార్యాలయంతో పాటు ప్రాథమిక పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పల్లెప్రకృతివనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కిచెన్‌గార్డెన్‌లో కూరగాయలు పండించి మధ్యాహ్న భోజనంలో ఉపయోగించటం వలన ఎన్నో ప్రయోజనాలున్నాయన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.

మహిళల ఆర్థిక అభివృద్ధికి సహకారం : కలెక్టర్



మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

బోథ్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆర్థికాభివృద్ధికి గాను ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తున్నాయని అందులో భాగంగానే డ్వాక్రా మహిళా సంఘాలకు ఆసక్తి ఉన్న వారికి పలు రకాల సహకారం అందించి వ్యాపార అభివృద్ధికి తోడ్పాటునందిస్తుందని కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పొచ్చెర జల పాతం వద్ద మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అందులో భాగంగానే అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు పనులను అప్పజెప్పడం జరుగుతుందన్నారు. వ్యాపారాల నిర్వహణకు బ్యాంకులతో పాటు శ్రీనిధి డబ్బులను వినియోగించుకోవాలని, తిరిగి చెల్లించి రెట్టింపు రుణం పొందాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే జాదవ్ అనిల్ మాట్లాడుతూ మహిళా ఆర్థిక అభివృద్ధితో, సమాజాభివృద్ధి జరుగుతుందన్నారు. అనంతరం 19 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులను అందించారు. డీఆర్డీఏ పీడీ సాయన్న, డీపీడీ గంగన్న, తహసీల్దార్ సుభాష్ చంద్ర, రేంజ్ అధికారి పుండలిక్, ఎంపీడీవో అప్పారావు సభ్యులున్నారు.

మహిళా శక్తి క్యాంటిన్ ప్రారంభం

ఆదిలాబాద్ రూరల్ : మహిళలు స్వయం శక్తితో ఆర్థికంగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్‌ను బుధవారం ఎంపీ గొడం నగేష్, మున్సిపల్‌చైర్మన్ జోగు ప్రేమేందర్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, మున్సిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



ఫొటో న్యూస్

పాఠశాల ఆవరణలో మేత మేస్తున్న పశువులు

పాఠశాలలో పశువుల మేత

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి) : ఈ పశువుల మంద ఏకంగా పాఠశాలలోనే మేత మేస్తున్నాయి. ఈ పశువుల మందలు ఓ మైనార్టీ పాఠశాల ఆవరణలోనే మేస్తున్నాయి. వివరాలు.. ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలోని బంగారిగూడ మైనార్టీ పాఠశాల ఆవరణలో ఇలా పశువుల మందలు గడ్డి మేతకు వస్తున్నాయి. ఈ పాఠశాల ఆవరణలో పెరిగిన గడ్డి గాదంను తొలగించే ప్రయత్నం సంబంధిత అధికారులు చేయకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. పశువులు మేస్తేనైన ఆవరణలో గడ్డి తొలగించినట్లు అవుతుందని రైతులు వారి మందలను ఇక్కడ మెపుతున్నారు. కాగా తక్షణమే అధికారులు పాఠశాల ఆవరణలో గడ్డి తొలగించి పరిశుభ్రత ఉండేలా చేస్తే విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ప్రయోజనకరంగా ఉంటుంది. పిల్లలకు రక్షణ కరువవుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

మహిళలు ఎదగాలి : ఆత్రంసుగుణ



విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ ఇన్‌చార్జి

ఉట్నూర్,అక్టోబరు23(ఆంధ్రజ్యోతి)మహిళలను శక్తివంతులుగా తయారు చేయడమే ఇందిరా ఫెలోషిప్ లక్ష్యమని ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆత్రంసుగుణ అన్నారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 18నుంచి 20 వరకు దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన శక్తి అభియాన్ ఇందిరా ఫెలోషిప్ జాతీయ కార్యక్రమానికి హాజరై వచ్చిన సందర్భంగా మాట్లాడుతూ రాజకీయ రంగాలతో పాటు అన్ని రంగాలలో మహిళలు శక్తివంతంగా తయారు చేయడమే ఇందిరా ఫెలోషిప్ లక్ష్యం అన్నారు. ఏఐసీసీ అధినేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో గ్రామస్థాయి నుంచి మహిళలను అభివృద్ధి పరచాలని సూచించారన్నారు. సమావేశంలో మహిళలు రాజవ్వ, కవతి, సరిత, ఆశమ్మ, కమల తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలి

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్‌లో మిషన్ భగీరథ నీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని అధికారులను కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ కోరారు. బుధవారం ఫిల్టర్ బెడ్‌లో మున్సిపల్ కమిషనర్ ఖమర్, ఆర్‌డబ్ల్యూఎస్ గ్రిడ్ ఎస్‌ఈ గోపిచంద్ కౌన్సిలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఫిల్టర్ బెడ్‌లో జరుగుతున్న పనులు, వాల్ రిపేర్లు తదితర వాటిని పరిశీలించారు. పట్టణంలో త్వరలో నీటి సరఫరా పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఏళ్లు గడిచినా.. ఎకరం తడవలే?

(5వ పేజీ తరువాయి)

సేకరించారు. మిగితా భూసేకరణకు నిధుల కొరత ఆటంకంగా మారింది. పూర్తిస్థాయిలో భూసేకరణ చేపట్టక పోవడంతో కాలువల నిర్మాణం పనులు అసంపూర్తిగానే కనిపిస్తున్నాయి. ఏళ్ల తరబడి కాలువల నిర్మాణ పనులు పూర్తికాక పోవడంతో ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. ముఖ్యంగా డి-14, డి-19 కాలువల ద్వారా 7 డిస్ట్రిబ్యూటర్లతో ఆయకట్టుకు సాగునీటిని అందించాల్సి ఉంది. సుమారుగా రూ.80 కోట్ల వరకు పెండింగ్ బిల్లులు ఉండడంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్ చేతులెత్తేస్తున్నాడు. ఇకనైనా భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేస్తేనే ఆయకట్టుకు సాగునీటిని అందించే అవకాశం ఉంటుంది. గత మూడేళ్ల క్రితమే భూసేకరణ కోసం జిల్లా కలెక్టర్ అకౌంట్‌లో రూ.16 కోట్ల నిధులను ప్రభుత్వం జమ చేసినట్లు తెలుస్తుంది. కానీ ఇప్పటి వరకు ప్రభుత్వం ఫైనాన్స్ క్లియరెన్స్ ఇవ్వక పోవడంతో నిధులు నిరుపయోగంగానే మారాయి.

ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాం

: రవీందర్, ఈఈ, పెన్‌గంగ బ్యారేజీ

కోర్టా-చనకా బ్యారేజీ నిర్మాణ పనుల వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఇప్పటికే హత్తిఘాట్ పంప్‌హౌజ్ వెట్‌రన్ విజయవంతంగా పూర్తి చేశాం. ఈ యేడు కాలువలు పూర్తయిన వరకు రైతుల డిమాండ్‌ను బట్టి సాగునీటిని అందించే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే పనులను ప్రారంభిస్తాం. వర్షాకాలంలో పనులను చేపట్టేందుకు అవకాశం లేకుండా పోయింది. ప్రభుత్వ ఆదేశాలు రాగానే పంప్‌హౌజ్ ద్వారా నీటిని ఎత్తి పోసి ఆయకట్టుకు సాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

బ్యాంకు సేవలపై అవగాహన

ఇంద్రవెల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తేజాపూర్, ధర్మసాగర్ గ్రామాల్లో బుధవారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో బ్యాంకు సేవలపై రైతులకు, బ్యాంకు వినియోగదారులకు అవగాహన కల్పించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు అకౌంటెంట్ ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో అటల్ పెన్షన్ యోజన, ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి భీమా యోజన, జనరల్ ఇన్సూరెన్స్ పథకాలపై అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంత ప్రజలు, రైతులు, బ్యాంకు వినియోగదారులు బ్యాంకు సేవలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, బ్యాంకు వినియోగదారులు తదితరులు ఉన్నారు.

సెల్‌ఫోన్ పోతే ఆందోళన వద్దు : డీఎస్పీ

ఇంద్రవెల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : సెల్‌ఫోన్ పోయిన చోరీకి గురైనా ఆందోళన చెందవద్దని, సీఈఆర్‌ఆర్ ద్వారా తిరిగి పొందవచ్చని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల చోరీకి గురైన, పోగొట్టుకున్న నాలుగు సెల్‌ఫోన్‌లను సంబంధిత వ్యక్తులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చోరీకి గురైన ఫోన్లు త్వరితగతిన పట్టుకోవడానికి సీఈఐఆర్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సంబంధిత వెబ్‌సైట్‌లో వినియోగదారులు నమోదు చేసుకుంటే పోగొట్టుకున్న సందర్భాల్లో సులభంగా స్వాధీనం చేసుకోవచ్చన్నారు.

మంత్రిని కలిసిన కందిశ్రీనివాస్‌రెడ్డి

ఆదిలాబాద్‌అర్బన్, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జీ కందిశ్రీనివాస్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పంటలు నష్టపోయిన జిల్లా రైతులకు నష్ట పరిహారం అందించినందుకు, ఎకరానికి 10క్వింటాళ్ల సోయాబీన్ కొనుగోలు నిర్ణయం తీసుకున్నందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. నియోజక వర్గానికి సంబంధించిన పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.బేల మండలానికి కూడా ప్రత్యేక వ్యవసాయ మార్కెట్ కమిటీని కేటాయించాలని వినతి పత్రాన్ని అందజేశారు.అదే విధంగా త్వరలో జరిగే జైనథ్ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారానికి హాజరు కావాలని మంత్రి తుమ్మలను ఆహ్వానించారు. అనంతరం మంత్రి కంది శ్రీనివాస్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు.

పోలీసు స్టేషన్‌లో ఓపెన్ హౌజ్

నార్నూర్, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి) పోలీసు వ్యవస్థ ప్రజలకు నిరంతరం రక్షణగా పని చేస్తుందని సీఐ రహీంపాషా అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో ఓపెన్ హౌజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మానవ సమాజంలో పోలీసు పాత్ర వారి విధులు పై అవగాహన కల్పించారు. పోలీసు స్టేషన్ ఫిర్యాదు ఎలా చేయాలి వాటిని ఎలాంటి చర్యలు తీసుకుంటారని అనేది వివరించారు. ఆయుధాలు వినియోగం, డాగ్‌స్క్వాడ్ మెటల్ డిటెక్టర్ కమాండింగ్ కంట్రోల్ గది నిందతులను బంది చేసి ఉంచే సెల్‌ను ప్రత్యక్షంగా చూపించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ ఫుటేజ్‌పై అవగాహన సదస్సు

భైంసా రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : భైంసా గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం భైంసా మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు, వ్యాపారస్తులకు సీసీ కెమెరాలపై సీఐ నైలు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సీసీ కెమెరాల వలన దొంగతనాల వాస్తవాలను తెలుసుకోవడానికి సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సీసీ కెమెరాల వల్ల నేరాల సంఖ్య అదుపులోకి వస్తుందని, నేరస్తులను త్వరితగతిన పట్టుకోవడంలో ఎంతగానో దోహదపడతాయన్నారు. డయల్ 100కు ఫోన్ చేసిన ఐదు నిమిషాలలో పోలీసులు బాధితుల వద్దకు చేరుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాపారస్తులు, ప్రజాప్రతినిధులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల పరిరక్షణకు పాటుపడాలి

- భైంసా రూరల్ సీఐ

కుభీర్, అక్టోబరు 23 : మండలంలోని గ్రామాల్లో గల ఆలయాల పరిరక్షణకు గ్రామస్తులు పాటు పడాలని భైంసా రూరల్‌సీఐ నైలు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని విఠలేశ్వర ఆలయంలో ఆయా గ్రామాల ఆలయ కమిటటీ నాయకులతో, గ్రామస్తులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో గల దేవాలయాల పరిరక్షణ కోసం, అసాంఘిక కార్యాకలాపాలు దొంగతనాలు జరగకుండా కమిటీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకుంటే దొంగతనాలని అరికట్టవచ్చని సూచించారు. గ్రామస్థుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో విఠలేశ్వర ఆలయ కమిటీ నాయకులు పెంటాజీ, కందూర్ చిన్న సాయినాథ్, చంద్రశేఖర్‌పటేల్, మెగా వాటర్ అనీల్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై గ్రామసభ

భైంసా రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేగాం గ్రామంలో బుధవారం ఉపాధి హామీ పనులపై డీఆర్డీవో విజయలక్ష్మి గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో ప్రతి పౌరుడికి 100 రోజులు పని కల్పించే లక్ష్యంగా 2024-2025 సంవత్సరం ప్రణాళిక వేయాలని అధికారులకు సూచించారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి వ్యక్తి వంద రోజులు పని కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, టీఏలు, పంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అధికారుల సస్పెన్షన్‌ను ఖండిస్తున్నాం

- సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు

నిర్మల్ అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : డిజిటల్ సర్వే చేయడం లేదన్న ఆలోచనతో ఈ విషయాన్ని సూటిగా చెప్పకుండా రైతు బీమా చేయడంలో నిర్లక్ష్యం చేశారని కారణంగా చూపుతూ రాష్ట్రంలో 150కి పైగా వ్యవసాయ విస్తీర్ణ అధికారులను సస్పెన్షన్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్‌ఈయూ) ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు అన్నారు. 20,000ల మంది చేయాల్సినటువంటి పనిని కేవలం 2,600ల మంది ఏఈవోలతో చేయించడం సబబు కాదని ఆవేదన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ హయాంలో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

- మాజీ మంత్రి జోగురామన్న

ఆదిలాబాద్‌అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజా, రైతాంగ విధానాలకు వ్యతిరేకంగా చేపడుతున్న బీఆర్‌ఎస్ పోరుబాటకు సర్వం సిద్ధం చేసినట్లు మాజీ మంత్రి జోగురామన్న తెలిపారు. సభకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరు కానున్నారని తెలిపారు. బుధవారం సభ ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతాంగంతో పాటు సామాన్య ప్రజానీకం తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటుందన్నారు. ప్రజలకు ఇచ్చిన ఆరుగ్యారంటీలు, హామీలను నేరవేర్చడంలో సీఎం పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ రైతువ్యతిరేక విధానాలతో రైతులు అధైర్యపడకుండా కేటీఆర్ సారథ్యంలో టీఆర్‌ఎస్ పార్టీ రైతులకు ఎళ్లవేళలా అండగా ఉంటుందన్నారు. ప్రజలకు భరోసా కల్పించేందుకు కేటీఆర్ చేపడుతున్న పోరుబాట సభకు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాల్గొన్నారు.

భోథ్ : రామ్‌లీలా మైదానంలో గురువారం కేటీఆర్ ఆధ్వర్యంలో జరుగనున్న సమావేశానికి రైతులు, పార్టీ అభిమానులు స్వచ్ఛందంగానే రానున్నారని, కార్యకర్తలను రావాలని తాము పిలుపు ఇవ్వలేదని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంపైన ఉన్న వ్యతిరేకత ఏ మేరకు ఉంది అనేది తెలిసి పోతుందన్నారు.

రైతన్నను మోసగించిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

- బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్



లింగాపూర్‌లో రైతులతో మాట్లాడుతున్న జాన్సన్ నాయక్

ఖానాపూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మోసపూరిత హామీలతో గద్దెనెక్కి అధికారంలోకి రాగానే తెలంగాణ రైతన్నను మోసగించిన కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెట్టాలని బీఆర్‌ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జి భూక్యా జాన్సన్ నాయక్ అన్నారు. బుధవారం కడెం మండలం లింగాపూర్ గ్రామంలో పర్యటించిన ఆయన స్థానిక రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులకు రుణమాఫీ అయ్యిందా, రైతు బంధు వస్తుందా అని ఆరా తీశారు. కాగా పలువురు రైతులు తమకు రైతు బంధు రావడం లేదని, రుణమాఫీ కూడా కాలేదని జాన్సన్‌కు తెలిపారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలంటే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కారు గుర్తుకే పట్టం కట్టాలని ఆయన కోరారు. రైతుల కోసం గతంలో తమ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ చేపట్టిన కార్యక్రమాలను గుర్తు చేశారు. ఇదివరకే వానాకాలం రైతు బంధుకు కాంగ్రెస్ పార్టీ రాం రాం చెప్పిందన్నారు. రైతులకు ఇచ్చిన హామీలతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని ఆయా వర్గాలకు ఇచ్చిన 420 హామీలను అమలు చేసే వరకు ఈ ప్రభుత్వంపై తమ పోరాటం ఆగదన్నారు. నేడు రైతు సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు ఆదిలాబాద్ వేదికగా నిర్వహిస్తున్న రైతన్నల కోసం రామన్నల పోరు బాట కార్యక్రమానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతున్నారన్నారు. ఖచ్చితంగా ఈ ప్రభుత్వం మెడలు వంచి ఇచ్చిన హామీలను అమలు చేయించే బాధ్యతను ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్‌ఎస్ పార్టీ తీసుకుంటుందన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- నిర్మల్ జిల్లాలో ఘటన
- ఆదిలాబాద్‌లో మరొకరు



ప్రమాద బాధితులు

భైంసా రూరల్, అక్టోబరు 23 : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన జిల్లాలోని భైంసా మండలంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కుభీర్ మండలంలోని బకోట్ పాంగ్రీ గ్రామానికి చెందిన నమన్కర్ సాయినాథ్ ఉదయం వేళ వాలేగాం గ్రామంలోని తన సోదరి ఇంటికి వెళ్లాడు. సాయంత్రం వేళ తిరిగి స్వగ్రామానికి వస్తుండగా.. మార్గమధ్యలో దేగాం బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వాహనం అని బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో సాయినాథ్ అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే అదే జాతీయ రహదారిపై ముథోల్ మండలం సరస్వతీనగర్ గ్రామానికి చెందిన వాగ్మేరే మురళీధర్ (37) భైంసా నుంచి విధులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా.. దేగాం గ్రామంలోని రైస్‌మిల్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో మురళీధర్ అక్కడికక్కడే మరణించాడు. ఈ ప్రమాదంలో ఇలేగాం గ్రామానికి చెందిన మహ్మద్‌తో పాటు భైంసా మండలంలోని సుంక్లి గ్రామానికి చెందిన విఠల్‌కు సైతం తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వీరిని చికిత్స నిమిత్తం వెంటనే భైంసాలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా.. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భైంసాలోని ఆస్పత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ఇచ్చోడ : రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందిన ఘటన మండలంలోని బాబుల్‌డో వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం బిలోలి గ్రామానికి చెందిన అభిరాజ్(19) తన మిత్రుడితో కలిసి ద్విచక్రవాహనంపై ఉట్నూర్ వెళ్లి తిరుగి స్వస్థలానికి బయలుదేరె సమయంలో ఇచ్చోడ సమీపంలోని బాబుల్‌డో జాతీయ రహదారిపై ముందర వెళ్తున్న మంచినీటి ట్యాంకర్‌ను వెనుకనుంచి ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో అభిరాజ్ తీవ్రగాయాలతో పడి ఉండగా స్థానికులు ఆ యువకుడిని రిమ్స్ ఆసుపత్రికి తరలించే క్రమంలో మృతిచెందినట్లు తెలిపారు.

విద్యార్థులను నిష్ణాతులుగా తీర్చిదిద్దాలి

భైంసా, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ద్వారా ఉద్యోగం సాధించిన నూతన ఉపాధ్యాయులందరూ ఉత్తమ బోధన చేపట్టి విద్యార్థులను నిష్ణాతులుగా తీర్చిదిద్దాలని భైంసా మున్సిపల్ కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లా ప్రతినిధి చందులాల్ సూచించారు. బుధవారం ఏపీ నగర్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో నూతనంగా చేరిన ఉపాధ్యాయులకు వార్డువాసుల తరఫున నిర్వహించిన సన్మాన సభ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రణాళికబద్ధమైన విధానాల ద్వారా విద్యార్థులకు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ ప్రయోజకులుగా తీర్చిదిద్ది వారి ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాట వేయాలని ఆకాంక్షించారు.

ఏఈవోల సస్పెన్షన్‌పై నిరసన

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : రైతు బీమాలో నిర్లక్ష్యం వహించారన్న కారణంగా 163 ఏఈవోల సస్పెన్షన్ నిరసిస్తూ బుధవారం ఏఈవోలు హైదరాబాద్ కమిషనర్ కార్యాలయానికి నిర్మల్ నుంచి బయలుదేరారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన డిజిటల్ పంట నష్టం నమోదు కార్యక్రమానికి ఎలాంటి మౌలిక వసతులు కల్పించలేదని తగినంత మంది సహాయకులను నియమించలేదని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 వేల మంది చేయాల్సిన సర్వే కేవలం 2,600ల మందితో చేయిస్తున్నారన్నారు. నిధులను పక్కదారి పట్టించారని పేర్కొన్నారు. శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న ఏఈవోలను సస్పెండ్ చేయడాన్ని ఖండించారు.

నిరుద్యోగ యువకులకు స్వయం ఉపాధి

ఉట్నూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని బెల్లం పల్లి యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో స్వయం ఉపాధి కోసం శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్ ప్లంబింగ్ అండ్ శానిటేషన్ కోర్సులలో మూడునెలల పాటు ఉచిత శిక్షణ ఇచ్చి ప్రైవేట్ రంగంలో ఉద్యోగం కల్పించానని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా తెలి పారు. బెల్లంపల్లి వైటీసీలో 10వ తరగతి ఉత్తీర్ణులు అయిన 3నెలలు శిక్షణ కోసం 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల వరకు వయస్సు ఉన్న వారు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, క్యాస్ట్ సర్టిఫికేట్, టెన్త్‌మెమో, ఇన్‌కమ్ సర్టిఫికేట్ జిరాక్స్ ప్రతులు మాత్రమే తీసుకొని రావాలని శిక్షణ కాలంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి, యూనిఫాం,హెల్మెట్, షూ, ట్రైనింగ్ కోర్సు మెటీరియల్ ఉచితంగా ఇవ్వబడునన్నారు. ఆసక్తి గల వారు ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో 9493535052, 9666748105 ఈ ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

జీవో 29ని రద్దు చేయాలి

ఉట్నూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : గ్రూప్-1 ఉద్యోగ నియ మకాల కోసం ప్రభుత్వం విడుదల చేసిన జీవో 29ని రద్దు చేయాలని కులసంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం చేసే విధంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూనుకోవడం సరైనది కాదన్నారు. సమావేశంలో గర్మ కుర్తి వెంకటేశ్, జాదవ్‌రవి, గొల్లపల్లి శ్రీనివాస్, నర్సయ్యలు పాల్గొన్నారు.

ప్రతిరోజు నడకతో ఆరోగ్యం : సీఐ

బోథ్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రతిరోజు ఉదయం పూట నడకతో ఆరోగ్యంగా ఉంటారని బోథ్‌సీఐ రమేష్, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్స వాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో 2కే రన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజు నడక వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయవద్దని చిన్న చిన్న వ్యాయా మాలు ఆరోగ్యానికి ఉపకరిస్తాయన్నారు. యువకులు తప్పనిసరిగా ముందు చూపుతో ఉదయం అరగంట నడక వ్యాయామం అలవాటు చేసుకోవాలని సూచించారు. ర్యాలీలో మండల కేంద్రంలోని యువ కులతో పాటు పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

ఇచ్చోడ, అక్టోబరు, 23(ఆంధ్రజ్యోతి) : అధ్యాత్మికతను అలవర్చుకోవాలని బోథ్‌ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని మల్యాల గ్రామంలో నిర్వహించిన సప్తాహ ముగింపు కార్యక్రమానికి హాజరై ప్రసంగించారు. ప్రతిఒక్కరూ దైవమార్గంలో నడవాలని సూచించారు. గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామస్థులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఆయన వెంట మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఇటీవల కాలంలో ఇచ్చోడ మండల కేంద్రంలోని జాఫర్‌బేకరీ అగ్నిప్రమాదానికి గురైన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అగ్ని ప్రమాదానికిగురైన బేకరీని పరిశీలిం చారు. అనంతరం మండల కేంద్రంలోని, బీఆర్‌ఎస్ నాయకుడు పాండురంగ్ తండ్రి మృతిచెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం సురుకుంటి కృష్ణారెడ్డి కుమారుడు ఇటీవల మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని పరిశీలించారు.

క్రైమ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ జిల్లా కార్యదర్శిగా గోవర్ధన్

ఇచ్చోడ, అక్టోబరు, 23 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ క్రైమ్‌కంట్రోల్ ఆర్గనైజేషన్ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శిగా పట్ల గోవర్ధన్‌ను నియమించినట్లు కమిటీ జిల్లా అధ్యక్షుడు షేక్‌ఇమ్రాన్ తెలిపారు. మండలంలోని కొకస్‌మన్నూర్ గ్రామానికి చెందిన పట్ల గోవర్ధన్‌కు జిల్లా కార్య వర్గంలో చోటు దక్కినందుకు పలువురు ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా షేక్ ఇమ్రాన్ చేతులమీదుగా నియమాకపత్రాన్ని అందజేయడం జరిగింది.

స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ సత్తా చాటుతుంది

- వనపర్తి ఎమ్మెల్యే తుడిమేఘారెడ్డి

ఆదిలాబాద్‌అర్బన్,అక్టోబరు23(ఆంధ్రజ్యోతి)మహారాష్ట్రలో జరగనున్న అసెంబ్లి ఎన్నికల ప్రచారం నేపథ్యంలో వనపర్తి ఎమ్మెల్యే తుడిమేఘారెడ్డి జిల్లా కేంద్రానికి వచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అసెంబ్లి ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. త్వరలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లోను కాంగ్రెస్ పార్టీ సత్తా చాటుతుందని ఎమ్మెల్యే అన్నారు. అదే విధంగా మహారాష్ట్ర అసెంబ్లి ఎన్నికల్లోను పార్టీ విజయ ఢంకా మోగించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇందులో జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్, లోక ప్రవీణ్‌రెడ్డి, నాయకులు రంగినేని శాంతన్‌రావు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చరణ్‌గౌడ్, కౌన్సిలర్లు, దొగ్గలి రాజేశ్వర్, మహిళ నాయకురాలు శ్రీలేఖ తదితరులున్నారు.

వైద్యానికి సహాయం అందించిన ఆడే గజేందర్

నేరడిగొండ, అక్టోబరు23: పలు ఆరోగ్య కారణాలతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తేజాపూర్ గ్రామ నివాసం ఏలేటి మనోజ్‌రెడ్డి వైద్య సహాయం చేయవల్సిందిగా అడిగినవెంటనే సీఎంఆర్ఎఫ్ పథకం కింద రెం డు లక్షల యాభై వేలు మంజూరు చేయించి వారి కుటుంబ సభ్యులకు బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడేగజేందర్ అంద జేశారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ వైద్య సహాయం కోసం పది లక్షల రూపాయల వరకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వైద్యఖర్చులకు అందించి బాధితులకు అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.

నిర్మల్‌లో నల్ల బ్యాడ్జీలతో నిరసన

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని ముత్యాలమ్మ విగ్రహంపై జరిగిన దాడి హేయనీయమైన చర్య అని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిసెమ్మె రాజు అన్నారు. బుధవారం సనాతన ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్మల్‌లోని గాంధీ చౌక్‌లో నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ చర్య హిందువుల మనోధైర్యాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. దాడికి పాల్పడ్డ వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపీ గోడం నగేష్

గ్రామీణ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలి : ఎంపీ

మావల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలని ఎంపీ గోడం నగేష్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల పాఠశాల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడలను ఆయన ప్రారంభించారు. అంతకుముందు ముఖ్య అతిథులుగా జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పతాకాలను ఆవిష్కరించి టార్చ్ రిలే ప్రారంభించారు. అనంతరం వాలీబాల్ క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ జీవితంలో ప్రతి ఒక్కరికి గెలుపు, ఓటములు సహజమని, ప్రతిదాన్ని స్పోర్టింగ్ స్పిరిట్‌గా తీసుకుని ముందుకు సాగాలన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ శ్యామల దేవి మాట్లాడుతూ క్రీడాకారులు చదువుతో పాటు క్రీడల్లో పాల్గొని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తే రిజర్వేషన్ అమలులో ఉంటుందన్నారు. ఆర్‌సీవో రాథోడ్ గోపిచంద్ మాట్లాడుతూ జిల్లాలోని మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలో క్రీడలకు ప్రత్యేక శిక్షణ శిబిరాలతో విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కీర్తి, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, కౌన్సిలర్ పవన్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

రత్నాపూర్‌కాండ్లీ పాఠశాలలో మోడల్ గ్రంథాలయం ప్రారంభం

నిర్మల్ అర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో నిర్మల్ మండలంలోని రత్నాపూర్ కాండ్లీ ప్రాథమిక పాఠశాలలో ఆదర్శ గ్రంథాలయాన్ని అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఐఏఎస్, జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రవీందర్‌రెడ్డి, రూమ్ టు రీడ్ సంస్థ స్టేట్ మేనేజర్ నరసింహా చారిలతో కలిసి ప్రారంభించారు. అనంతరం పాఠశాల ఆవరణలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగాధర్ అధ్యక్షతన విద్యార్థులు, గ్రామస్తులు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ, పాఠశాల యాజమాన్య కమిటీ వారందరితో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసంగించారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ.. గ్రంథాలయ పుస్తకాలను వినియోగించుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. రూమ్ టు రీడ్ ఇండియా సంస్థ వారు జిల్లాలోని అన్ని మండలాల్లో మండలానికి ఒకటి చొప్పున 19 మోడల్ గ్రంథాలయాలను ఏర్పాటు చేశారన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు అందుబాటులో ప్రభుత్వం రూమ్ టు రీడ్ సంస్థ వారు అందించిన రీడింగ్ మెటీరియల్ చాలా మెరుగ్గా ఉందని, వాటిని ఉపయోగిస్తూ ఉపాధ్యాయులు విద్యార్థుల్లో తరగతికి తగిన సామర్థ్యాలను పెంపొందించాలన్నారు. ఇందులో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి నర్సయ్య, ఎంఈవో వెంకటేశ్వర్లు, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ విజయ, స్వప్న, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఫోకస్

గడప దాటితే కోతులు.. వీధిలో కుక్కలు.. రోడ్లపై పశువులు!!

● ఇచ్చోడలో కోతులు, శునకాలు, పందుల బెడద ● రోడ్లపై పశువులతోనూ ఆటంకాలు ● భయభ్రాంతులకు గురవుతున్న స్థానికులు ● ఇంట్లో నుంచి ఒంటరిగా బయటకి వెళ్లాడానికి జంకుతున్న ప్రజలు



కాలనీలో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

ఇచ్చోడ, అక్టోబరు, 23(ఆంధ్రజ్యోతి): చుట్టూ చెట్లు.. గుట్టలు.. దట్టమైన అడవుల్లో ఉండాల్సిన కోతులు ఊర్ల మీద పడుతున్నాయి. దీంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇచ్చోడలో ఇటీవల కోతుల బెడద అధికమైంది. ఉదయం, సాయంత్రం గుంపులు, గుంపులుగా కోతులు సంచరిస్తూ ఇళ్లపై తిరుగుతున్నాయి. ఇచ్చోడ మండల కేంద్రంలోని టీచర్స్‌కాలనీ, ఆశోక్‌నగర్, ఇస్లాంపుర, రంజాన్‌పుర, తదితర ప్రాంతాల్లో ఇళ్లపై దూకుతూ.. తలుపులు, కిటికీలు తెరిచి కనిపిస్తే లోపలికి వచ్చి చేతికి అందిన ఆహార పదార్థాలతో ఉడాయిస్తున్నాయి. ఎవరైనా తరిమేందుకు ప్రయత్నించినా, అడ్డుకున్న దాడి చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో మీదపడి గిరడం, కొరకడం, వేళ్లతో గిచ్చి గాయపర్చడం చేస్తున్నాయి. మండల కేంద్రంలోని ఆశోక్ నగర్ కాలనీలో చిన్నారిపై కుక్కలు దాడి చేశాయి. టీచర్స్ కాలనీలో రోడ్డు వెంబడ వెళ్లే ఓ వ్యక్తి కోతులను అడ్డుకోబోయాడు. అయితే ఆ కోతి అతడిపై దూకి కొరికి గాయం చేసింది. వీటి కారణంగా ఇంటి ముంగిట ఓంటరిగా ఉండాలంటే భయపడాల్సి వస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మరోవైపు వీధుల్లో కుక్కలు గుంపులుగా



ఇంటి మెట్లపై గుంపులుగా ఉన్న కోతులు

తిరుగుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. గతంలో ఒకటో రెండో కనిపించేవని, ఇప్పుడు పదుల సంఖ్యలో శునకాలు గుంపులుగా సంచారిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. కోతులు, కుక్కలతో గాయాల పాలైన సంఘటనలు కోకొల్లలు. రాత్రి సమయంలో పనులు ముగించుకుని ఇంటికి వెళ్లే సమయంలో కుక్కలు గుంపులుగా తిరగుతూ అరుస్తూ మీదకు దూకె ప్రయత్నం చేస్తున్నాయి. ఓంటరిగా వెళ్లాలంటే చేతిలో పొడవటి కట్టె వెంబడి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఎదురైంది. ఇప్పటికైనా సంబంధిత అదికారులు స్పందించి కోతులు, కుక్కల బెడద నుంచి తప్పించాలని ఇచ్చోడ ప్రాంతవాసులు కోరుతున్నారు.

● రోడ్లపై పశువులతో ఆటంకాలు

జాతీయ రహదారితో పాటు వీధిరోడ్లపై పశువుల సంచారం ఎక్కువైంది. కొందరు పశువులను మేతకు ఊరి చివర అటవీ ప్రాంతానికి తరలించకుండా రహదారులపై విచ్చలవిడిగా వదిలిపెడుతున్నారు. దీంతో అవి రోడ్లపై లభ్యమయ్యే వృథా కూరగాయాలు, పాలిథిన్ కవర్లు, అట్టడబ్బాలు, కాగితాలను సైతం గత్యంతరం లేక తిని అనారోగ్యం పాలవుతున్నాయి. అంతేకాకుండా నడిరోడ్లపై దర్జాగా పడుకుంటాయి. వాహనాల రాకపోకలకు ఆటంకాలు కలుగుతున్నాయి. కాగా, వారసంతా సోమవారం రోజు మహిళలు వాటి కారణంగా గాయపడుతున్నారు. రోడ్లపై శరవేగంగా వచ్చే వాహనాలు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు లేకపోలేదు. శివాజీ చౌరస్తా నుంచి సిరిచెల్మ చౌరస్తా వరకు జాతీయ రహదారి నడిరోడ్డుపై పశువుల సంచారంతో పాటు అవి పడుకోవడం నిత్యం గమనించవచ్చు. పంచాయితీ వారు గతంలో పశువులను పట్టుకొని యాజమానులకు జరిమానా విధించేవారు. ప్రస్తుతం పట్టించుకునే నాథుడే కరువయ్యాడంటున్నారు.



వీధుల్లో గుంపులుగా కుక్కలు, పశువులు ఇలా..



ప్రధాన రోడ్లపై రాత్రి సమయంలో సంచరిస్తున్న పశువులు



ఇచ్చోడ సమీపంలోని జాతీయ రహదారిపై డివైడర్‌ను దాటి రోడ్డుపై అడ్డంగా వెళుతున్న పశువులు

ఎనిమిది రోజులుగా.. వజ్జర్ అడవుల్లో పెద్దపులి మకాం

● ప్రతియేటా ఇదే సమయంలో తిప్పేశ్వర్ అడవుల నుంచి ఆదిలాబాద్ జిల్లాలోని అడవుల్లోకి రాక ● తీవ్ర భయాందోళనకు గురవుతున్న స్థానిక గ్రామాల ప్రజలు ● ఆందోళన వద్దు : అధికారులు



పులి దాడిలో చనిపోయిన ఎద్దు



అడవిలో చెట్లపొదల్లో ఉన్న పెద్దపులి

బోథ్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న బోథ్ నియోజకవర్గంలోని బజార్ హత్నూర్ మండలంలోని దేద్ర అడవుల మీదుగా పులి బోథ్ రేంజ్ పరిధిలోని అడవులలోకి జత కోసం వస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు గతంలో గుర్తించారు. అయితే అధికారుల అంచనాకు తగ్గట్టుగానే మగ పెద్దపులి బజార్‌హత్నూర్-వజ్జర్ అడవుల్లోకి చేరుకుంది. గతంలో పులి మహారాష్ట్ర నుంచి సోనాల మీదుగా కౌటా(బి) గ్రామం పరిసరాల నుంచి కుంటాల అభయారణ్యంలోకి వెళ్లి కొంత కాలం నుంచి తిరుగు ప్రయాణం చేసేది. అదే తరహాలో ఈ ఏడాది సైతం పులి వచ్చిందని అటవీ శాఖ అధికారులకు అంచనాకు వచ్చారు. మంగళవారం అధికారులకు వజ్జర్ వెళ్లే రహదారి పక్కన ఉన్న అడవుల్లో కూర్చుని ఉన్న పులిని అటవీ శాఖ అధికారులు గుర్తించారు. పులి కనిపించిన వెంటనే వేగంగా తిరుగు ప్రయాణం సాగించారు. ఈ క్రమంలో ఓ ఉద్యోగి తన సెల్‌ఫోన్‌తో పాటు చెప్పులను సైతం విడిచిపెట్టి పరుగు పెట్టినట్లు ప్రత్యక్ష సాక్షుల ద్వారా తెలిసింది.

● పులి సంచారం వాస్తవమే..

వజ్జర్ అడవుల్లో పులి సంచరిస్తున్న మాట వాస్తవమేనని ఓ అటవీ శాఖ అధికారి పేర్కొన్నారు. అయితే మంగళవారం కనిపించిన పులి తనకు దొరికిన జంతువును తిని సేదతీరినట్లు గుర్తించారు. అయితే అధికారులు చూసిన సమయంలో పులి స్థిరంగా కూర్చోని ఉన్నట్లు గమనించారు. అయితే సమీప గ్రామాల వారు సైతం మంగళవారం రెండుసార్లు పులిని చూడటం జరిగిందని పేర్కొంటున్నారు. చింతల బోరి గ్రామానికి చెందిన కొంత మంది గత రెండు రోజుల క్రితమే పులిని చూసినట్లు పేర్కొంటున్నారు.

● ఆందోళన వద్దు..

పులి విషయంలో ప్రజలు ఆందోళన చెందవద్దని, అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని అటవీ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. అడవుల్లోకి పశువులను తీసుకువెళ్లవద్దని రాత్రిపూట పొలాలకు ఒంటరిగా వెళ్లవద్దని అధికారులు పేర్కొంటున్నారు. పొలాల చుట్టూ విద్యుత్ కంచెలు ఉంటే తొలగించాలని లేకుండా చట్టపరమైన చర్యలు ఉంటాయని అటవీ శాఖ అధికారులు అంటున్నారు.

● అప్రమత్తం చేస్తున్న అధికారులు

బోథ్(ఆంధ్రజ్యోతి): వజ్జర్ అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తున్న మాట వాస్తవమేనని అయితే అటవీ ప్రాంతంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేయడం జరిగిందని ఇంచార్జి అటవీ శాఖ అధికారి పుండలిక్ పేర్కొన్నారు. బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ తాను బుధవారం ఉదతయం పులి సంచరిస్తున్న ప్రాంతాన్ని పరిశీలించామని పులి అడుగులు గుర్తించామని పేర్కొన్నారు. అయితే పులి సంచరిస్తున్న అటవీ ప్రాంతంలోకి ఎవరూ వెళ్ల వద్దని చింతల బోరి వజ్జర్ పార్డీ కొల్హాపూర్, పెద్దగూడ, మామిడిగూడ గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

రైతు చూస్తుండగానే ఎద్దుపై పులి దాడి

● మృతి చెందిన ఎద్దు

బోథ్(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాబేర గ్రామానికి చెందిన జాదవ్ దిలీప్ అనే రైతుకు చెందిన ఎద్దుపై బుధవారం సాయంత్రం పులి దాడి చేసి చంపివేసింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి... బాబేర తండా గ్రామానికి చెందిన రైతు అటవీ ప్రాంతంలో ఉన్న తన చేనులోకి వెళ్లి సాయంత్రం పూట ఎద్దును మేపుతుండగా ఆకస్మికంగా పులి దాడి చేసింది. సంఘటనను చూసిన రైతు భయంతో పరుగులు తీశాడు. పులి దాడిలో ఎద్దు మృతి చెందింది. అనంతరం పులి అక్కడ నుంచి రేండ్లపల్లి గ్రామం సమీపంలోకి వెళ్లి పశువులపై దాడికి ప్రయత్నించగా గ్రామస్థులు కేకలు వేయగా సమీపంలోని పత్తి చేలకు పరారైంది. కాగా పులి గ్రామాల సమీపంలోకి రావడంతో గిరిజన గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. అంతేకాకుండా రైతులు తమ పంట కాపలా కోసం విద్యుత్ కంచెలను అక్కడక్కడ ఏర్పాటు చేయడంతో పులికి ముప్పు వాటిల్లే ఆస్కారం ఉందని అటవీ శాఖ అధికారులు ఆందోళన వ్యక్తం పరుస్తున్నారు. గ్రామాల రైతులు తమ పంట చేలకు అడవి జంతువుల నుంచి కాపాడేందుకు విద్యుత్ కంచెలు ఉంటే తొలగించాలని ముందస్తుగా సమాచారం అందజేయడం గమనార్హం.

నిండుకుండలా మత్తడి వాగు ప్రాజెక్టు



పూర్తిగా నిండి ఉన్న మత్తడి వాగు ప్రాజెక్టు

తాంసి రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాడి గ్రామ సమీపంలో ఉన్న మత్తడి వాగు ప్రాజెక్టు నిండుకుండలా కనిపిస్తోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 276.50 మీటర్లు కాగా ప్రస్తుతం పూర్తిస్థాయి నీటి మట్టడానికి చేరుకుంది. దీంతో ప్రాజెక్టు నిండుకుండలా కనిపిస్తోంది. అంతర్ రాష్ట్ర రహదారి పక్కన ఈ ప్రాజెక్టు ఉండటంతో వచ్చిపోయే వారు ప్రాజెక్టులో నీటిని చూస్తూ సంబరపడుతున్నారు. ఇక రబీ సాగుకు కూడా ఈ ఏడు పుష్కలంగా నీరు అందుతుందని ప్రాజెక్టు కింది రైతులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం ఈ ఏడాది ఖరీఫ్‌లో ఆశించిన స్థాయి పంటలు లేకపోవడం వల్ల కనీసం రబీ సాగు అయిన తమను ఆదుకుంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వైద్యుల నియామకానికి వాక్‌ఇన్ ఇంటర్వ్యూ

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలోని వివిధ విభాగాల్లో పూర్తి కాంట్రాక్టు ప్రాతిపదికన ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ట్యూటర్లు, సీఎంవో, సీఏఎస్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ జైసింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి ఈనెల 29న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు డైరెక్టర్స్ ఆఫీస్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఆదిలాబాద్.తెలంగాణ.జీవోవీ.ఇన్ లేదా రిమ్స్ ఆదిలాబాద్.ఓఆర్‌జీ వెబ్‌సైట్ సందర్శించాలని పేర్కొన్నారు.

28న జిల్లాకు బీసీ కమిషన్ బృందం

ఆదిలాబాద్ అర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఈ నెల 28న జిల్లాకు తెలంగాణ బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం రానున్నారని జిల్లా కలెక్టర్ రాజర్షిషా బుధవారం తెలిపారు. స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన అవసరమైన రిజర్వేషన్ల దామాషాను పేర్కొనే విషయంలో ఆసక్తి కలిగిన రాజకీయ పార్టీలు, సంఘాలు ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు బృందం వస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్, మంచిర్యాల ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఈనెల 28న ఆదిలాబాద్ జడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కమిషన్ చైర్మన్ నీరంజన్ నేతృత్వంలో సభ్యులు రాపోల్ జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, బీసీ వెల్ఫేర్ కమిషనర్లతో కూడిన బృందం ప్రజాభిప్రాయం సేకరణ జరుపనుందని వెల్లడించారు. అభిప్రాయాలు తెలపాలనుకునే వారు రాతపూర్వక అభ్యర్థనలను బృందంలోని సభ్యులకు నేరుగా అందజేయవచ్చని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

పోరుబాటకు సర్వం సిద్ధం

- కేటీఆర్ సభ ఏర్పాట్లను పరిశీలించిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న 6




క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్‌రాజర్షిషా, ఎమ్మెల్యే అనిల్

ఆర్థికాభివృద్ధికి సహకారం

- పొచ్చెర జలపాతం వద్ద మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించిన కలెక్టర్ రాజర్షిషా 6





7లో

అమ్మో.. పెద్దపులి!

బాబోయ్.. కోతులు!!



జిల్లాలో పెన్‌గంగా నదిపై .. 2016లో రూ.386 కోట్ల అంచనా వ్యయంతో కోర్టా-చనకా బ్యారేజీ నిర్మాణ పనులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అయితే, పనులను పూర్తి చేసేందుకు ఏడుసార్లు గడువు సమయాన్ని పొడిగించినా అనుకున్న లక్ష్యం చేరుకోకపోవడం గమనార్హం. దీంతో ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా కోర్టా-చనకా బ్యారేజీ పనులపై ప్రత్యేకదృష్టిని సారించాలని ఆయకట్టు రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

- జిల్లాలో గత 8ఏళ్లగా పెండింగ్‌లో కోర్టా-చనకా బ్యారేజీ పనులు
- అంచనా వ్యయం పెంచినా.. నిధుల విడుదలలో తీవ్ర జాప్యం
- అడుగుముందుకు పడని సాగునీటి కాలువల నిర్మాణం
- వెట్ రన్ పూర్తయినా.. నిరుపయోగంగానే హత్తిఘాట్ పంప్‌హౌజ్
- బ్యారేజీ పనులు పూర్తయితే.. 50వేల ఎకరాలకు పైగా సాగునీరు

ఏళ్లు గడిచినా.. ఎకరం తడవలే!

ఆదిలాబాద్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్-మహారాష్ట్ర సరిహద్దుల్లో పెన్‌గంగా నదిపై నిర్మిస్తున్న కోర్టా-చనకా బ్యారేజీ నిర్మాణం నిరుపయోగంగా మారింది. దాదాపుగా బ్యారేజీ నిర్మాణ పనులు పూర్తయిన కాలువల నిర్మాణంలో అడుగుముందుకు పడడం లేదు. ఏళ్లు గడుస్తున్నా.. ఎకరం ఆయకట్టుకు సాగునీరు అందించిన దాఖలాలు లేవు. గత ఎనిమిదేళ్ల క్రితం 2016లో రూ.386 కోట్ల అంచనా వ్యయంతో కోర్టా-చనకా బ్యారేజీ నిర్మాణ పనులకు గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ బ్యారేజీ పనులు పూర్తయితే ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో 50వేల ఎకరాలకు పైగా సాగునీరు అందే అవకాశం ఉంది. ఇప్పటికే పనులను పూర్తి చేసేందుకు ఏడుసార్లు గడువు సమయాన్ని పొగడించినా అనుకున్న లక్ష్యం చేరుకోలేదు. కోర్టా-చనకా బ్యారేజీ ఎగువ భాగాన నిర్మించిన హత్తిఘాట్ పంప్‌హౌజ్ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. దీంతో గతేడు అధికారులు వెట్‌రన్ పూర్తి చేశారు. అయినా ఆయకట్టుకు సాగునీరు అందడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. అందుబాటులో సాగునీరు ఉన్న ఆయకట్టుకు అక్కరకు రాక పోవడంతో యాసంగి పంటల సాగును వదిలేస్తున్నారు. అంచనా వ్యయాన్ని పెంచిన నిధుల విడుదలలో తీవ్ర జాప్యం జరుగడంతో అధికారులు చేతులెత్తేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా కోర్టా-చనకా బ్యారేజీపై ప్రత్యేకదృష్టిని సారించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

కనిపించని పురోగతి

కోర్టా-చనకా బ్యారేజీ నిర్మాణ అంచాన వ్యయాన్ని పెంచినా.. పనుల్లో పురోగతి మాత్రం కనిపించ లేదు. గత ప్రభుత్వం గరిష్ఠంగా రూ.765 కోట్లకు అంచనా వ్యయాన్ని పెంచింది. కానీ ఇప్పటి వరకు నయా పైసా విడుదల చేయక పోవడంతో ఎక్కడి పనులు అక్కడనే నిలిచిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో ఏఒక్క ప్రాజెక్టును పూర్తి చేయలేక పోయిందన్న విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే పూర్తయిన కోర్టా-చనకా బ్యారేజీ, హత్తిఘాట్ పంప్‌హౌజ్ పనులు పూర్తయిన నిరుపయోగంగానే మారి కనిపిస్తున్నాయి. అడ్డగోలుగా అంచనాలు పెంచిన దాననుగుణంగా ప్రభుత్వం నిధులను విడుదల చేయక పోవడంతో పనులు అర్ధాంతరంగానే నిలిచి పోయాయి. సాగునీటి కాల్వల నిర్మాణం పనులను చేపట్టేందుకు టెండర్ దక్కించుకున్న కాంట్రాక్ట్ కంపెనీలు వెళ్లి పోవడంతో తిరిగి టెండర్లను పిలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే కొంత వరకు నిర్మించిన కాలువల సిమెంట్ లైనింగ్ పనులు శిథిలాలుగా మారుతున్నాయి. పలుచోట్ల పగుళ్లు తేలి అధ్వానంగా మారి కనిపిస్తున్నాయి. కాలువల్లో భారీగా పూడిక చేరి అసలు కనిపించకుండానే పోతున్నాయి. ఏళ్ల తరబడి పనుల్లో పురోగతి లేకపోవడంతో అన్నదాతలు ఇక ఆశలు వదులుకుంటున్నారు.




హత్తిఘాట్ పంప్‌హౌజ్ కాలువ

భూసేకరణే ప్రధాన సమస్య

లోయర్ పెన్‌గంగా ప్రాజెక్టులో భాగంగా పెన్‌గంగానదిపై నిర్మిస్తున్న కోర్టాచనకా బ్యారేజీతో పాటు హత్తిఘాట్ పంప్‌హౌజ్‌కు భూసేకరణే ప్రధాన సమస్యగా మారింది. భూములను ఇచ్చేందుకు రైతులు సిద్ధంగా ఉన్న నిధుల కొరతతో అధికారులు నిస్సహాయత స్థితిలో కనిపిస్తున్నారు. చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందించేందుకు 3,315 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు 1,580 ఎకరాలను మాత్రమే

మిగతా 6వ పేజీలో...



అధికారి చొరవతో పాఠశాలలో చేరిన విద్యార్థి



విద్యార్థితో మాట్లాడుతున్న ఇన్‌చార్జీ డీడీ

ఉట్నూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు కూలిపనుల కోసం వలస వెళ్లడంతో గిరిజన విద్యార్థి పాఠశాలకు దూరమయ్యాడు. ఇది తెలిసిన గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జీ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ వసంతరావు చొరవ తీసుకోవడంతో పాఠశాలలో చేరాడు. ఉట్నూర్ మండలంలోని పిట్లగూడెంకు చెందిన గిరిజన విద్యార్థి రాజేందర్ మూడోతరగతి చదువుతుండగా తల్లిదండ్రులు కూలిపనుల కోసం జగిత్యాల జిల్లా మెట్‌పల్లి ప్రాంతానికి వలస వెళ్లాడు. తల్లిదండ్రులతో వెళ్లిన విద్యార్థి చదువుకు రెండేళ్లుగా దూరమయ్యాడు. పిట్లగూడ గ్రామంలోని పాఠశాలను ఇన్‌చార్జీ డీడీ వసంతరావు సందర్శించగా విషయం తెలిసింది. దీంతో డీడీ వసంతరావు విద్యార్థి ఉన్న ఇంటికి వెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చాడు. బుధవారం రాజేందర్‌ను ఎట్టకేలకు అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ ఆత్రం జగన్ ఆధ్వర్యంలో ఉట్నూర్‌లోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో చేర్పించారు.

జిల్లా పౌరసరఫరాల అధికారి ఆకస్మిక తనిఖీ



ఉట్నూర్‌లోని పౌరసరఫరాల గిడ్డంగిని తనిఖీ చేస్తున్న డీఎస్

ఉట్నూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పౌరసరఫరాల అధికారి మహమ్మద్ వాజీద్‌అలీ బుధవారం ఉట్నూర్ పట్టణంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని పౌరసరఫరాల గిడ్డంగిని సందర్శించి, తనిఖీ చేశారు. ఉన్న నిలువలను పరిశీలించి స్టాకు రిజిస్టర్‌లతో బేరీజు వేసుకున్నారు. ఇన్‌చార్జీ రాథోడ్ మహేందర్‌తో నిర్వహణ బాగుండాలని సూచించారు. అనంతరం పట్టణంలో ఉన్న గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసి బాలికలతో కలిసి భోజనం చేశారు. ఆశ్రమ పాఠశాలలకు ప్రభుత్వం నాణ్యమైన బియ్యం అందిస్తుందన్నారు. అనంతరం సమీపంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని బియ్యం పరిశీలించారు. అనంతరం ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తాను, సబ్‌కలెక్టర్ యువరాజ్, మర్మాట్‌లను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆయన వెంట నాయబ్ తహసీల్దార్లు మధుసూదన్, విశ్వనాథ్‌లున్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి



గురుకుల పాఠశాలలో భూమిపూజ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ఇచ్చోడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యార్థులు పూర్తిస్థాయిలో పట్టు సాధించాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి రూ.45లక్షల నిధులతో ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ భూమిపూజ చేశారు. అనంతరం పాఠశాలను పరిశీలించారు. పక్కనే ఉన్న ప్రభుత్వ డీగ్రీ కళాశాలను సందర్శించి అక్కడున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో అన్నిరకాల వసతుల కల్పనకు కృషిచేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, బీజేపీ మండల కన్వీనర్ నారాయణ, మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, నాయకులు శిరీష్‌రెడ్డి, గాడ్గె సుభాష్, షాబీర్, సుభాష్, పాఠశాల, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంఘం పేరుతో వసూళ్లు చేస్తే బహిష్కరిస్తాం

- తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షులు



మాట్లాడుతున్న తుడుందెబ్బ నాయకులు

ఇంద్రవెల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో ఎవరైనా సంఘం పేరు చెప్పి అక్రమంగా వసూళ్లు చేస్తే వారిని కమిటీ నుంచి బహిష్కరిస్తామని తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షులు పుర్కా బాపూరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి జిల్లా తుడుం దెబ్బ కమిటీల నాయకులతో అత్యవసర సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏజెన్సీలోని పలు అంశాలతో పాటు నవంబర్ 10 నుంచి 20 వరకు ఆదిలాబాద్ జిల్లాలో నిర్వహించే మహాసభల నిర్వహణపై ఇతర మండలాల నుంచి ఇంద్రవెల్లి మండల కేంద్రానికి వచ్చి అర్జీఐ వేస్తే అక్రమ వసూళ్ళకు పాల్పడుతున్న వారిని గుర్తించి అక్రమ పనులను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి తీర్మానం చేశారు.

పొన్నారిలో ట్రైనీ కలెక్టర్ల పర్యటన



గ్రామస్తులతో సమావేశమైన ట్రైని కలెక్టర్లు

తాంసి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ట్రైనీ కలెక్టర్ల పర్యటన మండలంలోని పొన్నారి గ్రామంలో బుధవారం జరిగింది. ఆరుగురు ట్రైనీకలెక్టర్లు గ్రామంలో పలు వీధుల గుండా తిరుగుతూ సమస్యలను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో ప్రత్యేక సమా వేశాన్ని ఏర్పాటు చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలు ఏ మేరకు ఉపయోగపడ్డాయో తెలుసుకున్నారు. పనుల్లో నాణ్యత ఏ మేరకు ఉందో అడిగి వివరాలు సేకరించారు. మరుగుదొడ్లు, మురికికాలువల నిర్మాణాలు ఏ మేరకు పూర్తయ్యాయి. ఎంత మంది వీటిని వినియోగించుకుంటున్నారు అన్న విషయంపై క్షుణ్ణంగా పరిశీలించారు.

ఆర్ఆర్ మాల్‌ను సీజ్ చేసిన మున్సిపల్ అధికారులు

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్‌లోని ఆర్ఆర్‌మాల్‌ను మున్సిపల్ అధికారులు బుధవారం సీజ్ చేశారు. ఆర్ఆర్ మాల్‌లోని సెప్టిక్ ట్యాంక్ నిర్వహణ సరిగా లేక ఆ ప్రాంతమంతా దుర్గంధం వ్యాపించడతో స్థానికులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు గతంలో నోటీసులు ఇచ్చిన కూడా యాజమాన్యం స్పందించకపోవడంతో ఆర్ఆర్ మాల్‌ను సీజ్ అధికారులు సీజ్ చేశారు.

గీత కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

- మోకుదెబ్బ జాతీయ అధ్యక్షులు అమరవేణి నర్సాగౌడ్

ఆదిలాబాద్‌అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : గౌడజన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ జిల్లా ముఖ్యనాయకుల సమావేశంను జిల్లా కేంద్రంలో జిల్లా అధ్యక్షులు అక్కల శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం మోకుదెబ్బ జాతీయ అధ్యక్షులు అమరవేణి నర్సాగౌడ్ మాట్లా డుతూ తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల ముందు గౌడ కులస్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కల్లు గీత కార్మికుల గీత కార్పొ రేషన్‌కు పాలక మండలిని ఏర్పాటు చేసి దానికి 5వేల కోట్ల రూపాయల నిధులు కేటాయించి ఆదుకోవాలని కోరారు. జిల్లాలో కొందరు అబ్కారి సీఐ, ఎస్సైలు, కానిస్టేబుల్స్, గీత కార్మికులను అధిక మాముళ్ల కోసం వేధిస్తున్నారన్నారు. వారి విధా నాలపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. సమావేశంలో జాతీయ అధ్యక్షులు, తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్, రాష్ట్ర అధికార ప్రతినిధి బాలసాని నారా యణ గౌడ్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి రంగు శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర నాయకులు రంగు నాగరాజ్‌గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పోతారం నర్సాగౌడ్, కొండ బాలగౌడ్, రాజేశ్వర్‌గౌడ్, మురళిగౌడ్ పాల్గొన్నారు.

ప్రజారక్షణే పోలీసు ప్రధాన లక్ష్యం : సీఐ

ఇంద్రవెల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా రక్షణే పోలీసు ప్రధాన లక్ష్యమని ఉట్నూర్ సీఐ మొగిలి పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాల్లో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు పోలీసుసేవలు, ఆయుధాలపై అవగాహన కల్పించేందుకే ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుశాఖ అందిస్తున్న సేవలు, చట్టాలపై విద్యార్థులకు అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రజల రక్షణ కోసమే పోలీసులు విధులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం చోరీల్లో శిక్షలు, షీటీమ్ బృందాల సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై దుబ్బాక సునీల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలి

- కార్యాలయం ఎదుట ఆదివాసీల ధర్నా

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 23(ఆంధ్రజ్యోతి): అటవీ అధికారులపై చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ కార్యాలయం ఎదు ట బుధవారం ఆదివాసులు ధర్నా నిర్వహించారు. అటవీ సంపద ఆధారంగా జీవనం కొన సాగిస్తున్న కొలాం గిరిజనులను ఆదుకొని ఉపాధి కల్పించాలని కొలాం సేవా సంఘం అధ్యక్షులు కొడప సోనేరావ్ అన్నారు. ఆది లాబాద్ రూరల్ మండలం అడవుల్లోకి ఆది వాసులను వెళ్లకుండా అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ జిల్లా అటవీ శాఖ కార్యాలయం ఎదుట సంఘం ఆధ్వర్యం లో ధర్నా నిర్వహించారు. ఇటీవల అడవిలోకి వెళ్లిన మహిళపై అటవీ శాఖ అధికారులు ప్రవర్తించిన తీరును ఖండిం చారు. కార్యక్రమంలో నాయకులు జంగుబా పు, భాస్కర్, దిలీప్, దేవిదాస్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న ఆదివాసీలు